క్లుప్తంగా

సభా ప్రాంగణం పరిశీలన



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి, సోమ్లతండా గ్రామ పంచాయతీల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు జూలై 7వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఆదివారం మంత్రుల పర్యటన, శంకుస్థాపన కార్యక్రమాల సభా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

నూతన కమిటీ ఎన్నిక



శ్రీనివాసరావు, అధ్యక్షుడు



మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి

గార్ల : ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దూడపాంగు శ్రీనివాసరావు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దేశపాక మురళీకృష్ణ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మరమ్మతు పనులు షురూ



పనులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నగూడూరు : విస్సంపల్లి కొత్త చెరువు, జయ్యారంలోని పెద్ద చెరువు కట్టలకు శాశ్వత మరమ్మతు పనులను ఇరిగేషన్ డీఈ పొట్టయ్య, కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు మేఘన, సందీప్, రాజామాత, తెలంగాణ ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ వల్లూరి కృష్ణారెడ్డి, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

బయ్యారం : చెత్తాచెదారంతో నిండిన బయ్యారం పెద్దచెరువు ఆయకట్టు కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఏనుగుల ఐలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు సమీస్తున్న తరుణంలో చెరువు కాల్వల మరమ్మతులు నిర్వహించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

రహదారుల నిర్మాణం పూర్తిచేయాలి

బయ్యారం మండలంలో కంకరపోసి వదిలేసిన రోడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు మురళి, రాకేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమాజ సేవకు అంకితమవ్వాలి

తొర్రూరు : ఉద్యోగ విరమణ అనంతరం ఉపాధ్యాయులు సమాజ సేవకు అంకితమవ్వాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. మండలంలోని హరిపిరాల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రావుల నారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. నారాయణను ఉపాధ్యాయులు, స్థానికులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే అవకాశం ఈ వృత్తి ద్వారా లభిస్తుందన్నారు.

అనారోగ్యంతో సీపీఎం నాయకుడి మృతి



భిక్షపతి (ఫైల్)

మరిపెడ రూరల్ : మరిపెడలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు లింగంపల్లి భిక్షపతి(90) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు

నల్లబెల్లి : సోషల్ మీడియా వేదికగా మొబైల్‌కు వచ్చే ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయొద్దని ఎస్సై గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్స్ పంపిస్తూ మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేస్తే మొబైల్‌లో ఉండే సమాచారంతోపాటు డాటా, బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు గల్లంతయ్యే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

సిబ్బందిని నియమించరూ!

విద్యుత్ సబ్ స్టేషన్లలో వేధిస్తున్న సిబ్బంది కొరత

● డోర్నకల్ సబ్ స్టేషన్‌లో ఒక్కరితోనే విధులు



డోర్నకల్ విద్యుత్ సబ్ స్టేషన్

డోర్నకల్ : మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. డోర్నకల్, గొల్లచర్ల, పెరుమాళ్ల సంకీస, తోడేళ్లగూడెం, మన్నెగూడెం విద్యుత్ సబ్ స్టేషన్లలో సిబ్బంది కొరతతో కరెంట్ సరఫరాతో పాటు ఇతర పనులకు ఆటంకం కలుగుతోంది. డోర్నకల్ సబ్ స్టేషన్‌లో నలుగురు లైన్‌మెన్లు విధులు నిర్వహించాల్సి ఉండగా లైన్‌మెన్‌తో పాటు స్పెషల్ గ్రేడ్ ఆర్టిజన్ ఉద్యోగి విధుల్లో ఉన్నారు. డోర్నకల్ టౌన్‌కు సంబంధించి లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, ఇద్దరు అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం ఇద్దరు ఏఎల్‌ఎంలు విధుల్లో ఉన్నారు. వీరిలో ఒకరు ఇటీవల ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో చనిపోగా మరొకరు సెలవుపై వెళ్లారు. దీంతో ఇతర సబ్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఇక్కడికి రప్పిస్తున్నారు. పట్టణ పరిధిలో సుమారు 4,500 విద్యుత్ కనెక్షన్లు, 300 వరకు వ్యవసాయ కనెక్షన్లు ఉండగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో సిబ్బంది కొరతతో సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేక వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్యలతో సతమతం..

డోర్నకల్ సబ్‌స్టేషన్ పరిధిలోని బంజర్ ఫీడర్‌లో 80, ఉయ్యాలవాడ ఫీడర్ పరిధిలో 80, టౌన్ ఫీడర్ పరిధిలో 80, రైల్వే ఫీడర్ పరిధిలో 10 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వర్షాలు, గాలులు, ఓవర్‌లోడ్, షార్ట్ సర్క్యూట్, కోతులు తీగలపై పడటం వంటి కారణాలతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. విద్యుత్‌శాఖ ఏఈతో పాటు సబ్ ఇంజనీర్ విధుల్లో ఉన్నా వారు మండల వ్యాప్తంగా శాఖ పనితీరు, సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. సిబ్బంది కొరతతో ప్రైవేట్ వ్యక్తుల(ఆన్‌మ్యాన్)ను నియమించి వారి సేవలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఏడుగురు ఆన్ మ్యాన్లు మండలవ్యాప్తంగా విధుల్లో ఉన్నారు. మిగతా సబ్ స్టేషన్లకు సంబంధించి గొల్లచర్ల, ఉయ్యాలవాడ, తొడేళ్లగూడెం, మన్నెగూడెం గ్రామాల్లో లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం డోర్నకల్ మున్సిపల్‌తో పాటు మండలంలో 600కు పైగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు విద్యుత్ మీటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వాటిని ఆన్‌లైన్ చేసి ఫీజిబులిటీ పరిశీలించి ఇళ్లకు విద్యుత్ మీటర్లు అమర్చాల్సి ఉంటుంది. సిబ్బంది కొరతతో మీటర్లు అమర్చే పనులు మందకొడి సాగుతున్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను విభజించి పాలిస్తున్న బీజేపీ

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్ : దేశంలో కులాలు, మతాలుగా ప్రజలను విభజించి బీజేపీ పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కొండపల్లి, గోపాల్‌నగర్ కాలనీ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెక్యూలర్, సోషలిజం పదాలను తొలగించాలని కోర్టులను ఆశ్రయించడం, ఆ పదాలు అంటే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు భయమెందుకో చెప్పాలని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌తో యుద్ధం చేయకుండా వెనక్కి తిరిగి వచ్చిన బీజేపీ నేతలు దేశం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జూలై 5,6 తేదీల్లో పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, ఎండీ మహమూద్, రవీందర్, గార రవిచంద్ర బోస్, కూరాకుల పాల్ తదితరులు పాల్గొన్నారు.

'సీహెచ్‌సీలో ఖాళీలు భర్తీ చేయాలి'

గార్ల : గార్ల సీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేసి, మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం గార్ల ఆస్పత్రిలో సరిపడా వైద్యులను భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేయించాలని ఆమె డిమాండ్ చేశారు.ఇప్పటికైనా సంబంధిత ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారులు, కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, ఇమ్మడి గోవింద్, అంబటి వీరస్వామి, వి పెద్దవెంకటేశ్వర్లు, ఎం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న శ్రీనివాస్



కేసముద్రం: మాట్లాడుతున్న పాపారావు

నెహ్రూసెంటర్ : దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేసి రూ. 26 వేలు చెల్లించాలన్నారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్వత కోటేష్, శివ్వారపు శ్రీధర్, హలావత్ లింగన్న, ఏపూరి వీరభద్రం, ఎండీ బబ్బార్, బాలమల్లు, కృష్ణ, రాము, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం : ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ, జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మార్తనేని పాపారావు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి సీపీఎం కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జల్లె జయరాజ్, గొడిశాల వెంకన్న, సోమారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేయూత



ఉపేంద్రకు సాయం అందజేస్తున్న స్నేహితులు

మరిపెడ రూరల్ : మరిపెడలోని ఎల్లంపేట జెడ్పీఎస్‌ఎస్‌లో 1996–97 పదోతరగతి బ్యాచ్‌కి చెందిన బి.ఉపేంద్ర తన భర్తతో విభేదాలు తలెత్తగా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో ఉంటుంది. ఈక్రమంలో ఉపేంద్ర అనారోగ్యం బారిన పడి రూ.5లక్షల వరకు ఖర్చు చేసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమె కుటుంబాన్ని తోటిమిత్రులు రూ.20 వేలు నగదు సాయాన్ని ఆదివారం అందజేశారు. జెట్టి మురళి, జి.వెంకన్న, ఐనాల నవీన్, ఎం.సుధాకర్, ఎస్.కృష్ణ, బి.శ్రీనివాస్, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

తోటిమిత్రుడికి సాయం



శ్రీనుకు నగదు అందజేస్తున్న మిత్రులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లికి చెందిన చౌగాని శ్రీను ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. కాగా శ్రీనుతో కలిసి చదివిన పదోతరగతి మిత్రులు రూ.42,500 నగదును ఆదివారం అందజేశారు. మాజీ సర్పంచ్ యాస రమ, లక్కం నాగరాజు, సామ వెంకటరెడ్డి, చౌగాని వెంకన్న, మంచాల సుమలత, మంజుల, అలివేలు, లలిత, లక్ష్మి, కృష్ణ, సుజాత పాల్గొన్నారు.

వరుణుడు కరుణిస్తాడని..



రాంపురంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

వరుణుడి రాకకోసం ఎదురు చూస్తూ ఓ వైపు.. అదును దాటిందని మరో వైపు రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే విత్తనాలు నాటిన సమయానికి వర్షాలు కురవక పలువురు రైతులు రెండో సారి విత్తనాలు విత్తుకుంటున్నారు. వర్షం రాకపోతే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తే మొక్క మొక్కకు నీటిని అందించి కాపాడుకుంటామని మొక్కవోని ధైర్యంతో రైతులు చెప్పడం విశేషం.

– మరిపెడ రూరల్

'ఫోర్జరీ సంతకంతో మోసం'

గూడూరు : గ్రామ పంచాయతీ తీర్మానంలో తన పేరుతో ఫోర్జరీ సంతకం చేసి చేపల చెరువు రాయించుకొని దామరవంచ కోయ గిరిజనులు మోసం చేశారని మాజీ సర్పంచ్ ధరావత్ కొమ్మాలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దామరవంచ ఊర చెరువులో తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామ పరిధిలోని కోయ, లంబాడ గిరిజనులు ఊర చెరువులో చేపల పెంపకం చేసుకున్నామని తెలిపారు. కానీ కోయ గిరిజనులు తనపై కక్ష సాధింపుతో గ్రామపంచాయతీ తీర్మానంలో సర్పంచ్‌గా తాను సంతకం పెట్టినట్లు ఫోర్జరీ సంతకం చేసి, జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయ అధికారి ద్వారా చెరువులో చేపలు పట్టుకునే అధికారం ఒక వర్గానికే ఉందని రాయించుకున్నారని తెలిపారు. ఇదేంటని లంబాడ గిరిజనులు అడిగితే అధికారులు రాసి ఇచ్చారంటున్నారని, తన సంతకం ఫోర్జరీ చేయడమే కాక, లంబాడీలకు అన్యాయం చేశారని మత్స్యశాఖ జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్లు కొమ్మాలు తెలిపారు. తన సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, లంబాడీలకు చేపలు పట్టుకునే హక్కు కల్పించాలని కొమ్మాలు కోరారు.

మానుకోటలో పీరీల సందడి



మహబూబాబాద్ రూరల్ : కులమతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు ఐకమత్యంగా జరుపుకునే మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా ఆదివారం పీరీల సందడి ప్రారంభమైంది. మానుకోటలోని ప్రధాన వీధులు, పలు మండల కేంద్రాలకు చెందిన హిందూ, ముస్లిం భక్తులు సర్వాంగ సుందరంగా పీరీలను తయారుచేసి ఊరేగింపు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో పీరీలను ఎత్తుకుని నృత్యాలు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు. భక్తులు తమ ఇళ్ల ఎదుటకు వచ్చిన పీరీలకు నీళ్ల ఆరబోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఫొటోగ్రాఫర్లకు చేయూతనందిస్తాం..

● జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్



చెక్కు అందజేస్తున్న బాధ్యులు

మహబూబాబాద్ అర్బన్ : ఫొటోగ్రాఫర్ల కుటుంబాలను ఆర్థికంగా చేయూతనివ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తోట సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడారు. రాష్ట్రంలోని ఫొటోగ్రాఫర్లకు కుటుంబ భరోసా పథకం ఏర్పాటు చేశామని చెప్పారు. మానుకోట జిల్లాలో 900 సభ్యత్వాలు ఉన్నాయని, ఈ పథకానికి సభ్యుల నుంచి రూ.100తో ఉంటుందని తెలిపారు. ఈ పథకానికి అందరూ సహకరించి ప్రతి ఒక్కరూ కుటుంబ భరోసా స్కీంలో చేరాలని కోరారు. గూడూరు ఫొటోగ్రాఫర్ కుటుంబ సభ్యుడి కూతురు ఇటీవల నీట్ ఫలితాల్లో మంచి మార్కులతో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా జిల్లా ఫొటోగ్రఫీ అసోసియేషన్ తరఫున రూ. 10,000 చెక్కును అందజేశామని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపేటి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకృద్దీన్, ప్రధాన కార్యదర్శి కేశ సందీప్, కోశాధికారి కదుదుల రవి, జిల్లా కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ సింగంశెట్టి బాబురావు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

● స్కూల్ డ్రెస్‌లో హాజరైన పూర్వ విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పూర్తయిన తర్వాత ఎవరి దారి వారు చూసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాల్లో కొందరు.. మరికొందరు ఐర్లాండ్, లండన్, అమెరికా వంటి దేశాల్లో సెటిలయ్యారు. 1992లో మానుకోట పట్టణంలోని అరవింద విద్యాలయంలో పదో తరగతి పూర్తి చేసి వారు.. 33 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవాలని ఆలోచన చేశారు. అదికూడా నాటి స్కూల్ డ్రెస్‌లో రావాలనే కండిషన్ పెట్టుకున్నారు. ఈమేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. 50మంది పూర్వ విద్యార్థులు స్కూల్ డ్రెస్‌లో హాజరై.. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు చంద్రదేవ్, కుమారస్వామి, సలీం, కుమార్, నాగేశ్వర్‌రావు, శ్రీరామరావు, ఫజల్, లక్ష్మీనారాయణ, వీరాస్వామి, పూర్వ విద్యార్థులు ఓం ప్రకాశ్, ప్రమోద్, కటికరెడ్డి ఆదిత్య, మీనా, ధర్మేందర్, రాజు, శివరాం, శ్రీను, వేణు, స్వామి, నిరంజన్, సౌజన్య, ఉషశ్రీ, కృష్ణవేణి, నవీన్ తాడూరి, ధర్మేంద్ర జంగా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తొర్రూరు రూరల్: మాట్లాడుతున్న సీతారాములు

తొర్రూరు రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ శ్రీరాం సుధీర్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు కోరారు. ఆదివారం మండలంలోని నాంచారీమడూరు, వెలికట్ట, చీకటాయపాలెం గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు రామిని శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, నలమాస ప్రమోద్‌గౌడ్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, కాలునాయక్, దొనికన కుమారస్వామి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం..

పెద్దవంగర : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలతో పాటు తండాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీత్లా పండుగను ఘనంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్ననాయక్

నెహ్రూసెంటర్ : సీత్లా పండుగను వచ్చే నెల 8వ తేదీన రాష్ట్రమంతా ఒకే రోజున జరుపుకుని బంజారాల ఐక్యతను చాటుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీత్లా పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలకు వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మోతిలాల్ నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి మాలోత్ సురేష్‌నాయక్, కార్యదర్శి జర్పుల బాలు, రాంబాబు, బోడ రమేష్, సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు?

● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న భవనాలు



ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన



పెద్దముప్పారంలో మూతపడిన గ్రంథాలయం

దంతాలపల్లి : అభివృద్ధిలో భాగంగా మండలంలో పలు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా వాటిని ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. మండల కేంద్రంతో పాటు పెద్దముప్పారంలో నిర్మించిన కార్యాలయాలు ప్రారంభించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెద్దముప్పారంలో స్థానిక యువత అవసరాలకు రూ.3లక్షల వ్యయంతో గ్రంథాలయం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రారంభించారు. అయితే గ్రంథాలయం మూతపడడంతో యువతకు ఉపయోగపడడం లేదు. అలాగే మండల కేంద్రంలోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద రూ.20 లక్షల వ్యయంతో పల్లె దవాఖానాను నిర్మించారు. మూడేళ్లు గడిచినా కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లు రాకపోవడంతో పల్లె దవాఖానా భవనానికి విద్యుత్, తాగునీటి సౌకర్యం పనులు పూర్తి చేయలేదు. దవాఖానా భవనం చుట్టు చెత్త పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. ఊరికి దూరంగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాలను ఏళ్ల గడుస్తున్న పూర్తిస్థాయిలో పనులు జరగక, చేసిన పనులను అమలులోకి రాకపోవడంతో ప్రజలు ప్రభుత్వ అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

రైతులకు అండగా ఉంటాం..



తొర్రూరు రూరల్ : రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెర్లపాలెంలో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటునకు అయ్యే డబ్బులను అన్నదాతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, తన సొంత ఖర్చులతో వారి కష్టాలను తీర్చామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హనుమాండ్ల నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, మహబూబ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, దర్గయ్య, మహేందర్, మహేష్, సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.